

ఏయూ విద్యార్థులకు స్కాలర్‌షిప్

విశాఖ: ఏయూ బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ విద్యార్థులు 11మంది రూ.70 వేలు చొప్పున కాగ్నిజెంట్ స్కాలర్‌షిప్ సాధించారు.



ఘనంగా శ్రీపుష్పయాగం

సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణమహోత్సవాలు ముగింపు సందర్భంగా శ్రీ పుష్పయాగాన్ని విశేషంగా నిర్వహించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
40.3/26.0

తేలికపాటి వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి రెండు చోట్ల కురిసే అవకాశముందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

ఆ అమ్మ చిరంజీవి

- నలుగురికి అవయదానం చేసిన పద్మజ



అవయవదానం చేసిన పద్మజ

చోడవరం రూరల్: మరణం అంచులోనూ ఆమె చిరస్మరణీయమైన నిర్ణయం తీసుకున్నారు. తన అవయవాలను దానం చేయడం ద్వారా ఇద్దరి ప్రాణాలను కాపాడారు. మరో ఇద్దరికి వెలుగులు నింపారు. అరుదైన ఆ 'మృత' ఘటన పట్టణ సమీపంలోని గోవిందమ్మకాలనీలో చోటు చేసుకుంది. కాలనీ వాసి రాంసింగు పద్మజ సోమవారం మండలంలోని వెంకన్నపాలెం వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తలకు తీవ్ర గాయం కావడంతో ఆమెను బంధువులు విశాఖలోని కిమ్స్ ఐకాన్ (కృషి) ఆస్పత్రిలో చేర్చారు. అయితే ఆమె బుధవారం తుది శ్వాస విడిచారు. మృతురాలి కోరిక ప్రకారం ఆమె శరీర అవయవాలను నలుగురికి దానం చేసి వారికి ప్రాణదాతగా నిలిచారు. రెండు మూత్రపిండా(కిడ్నీ)లు ఇద్దరికి, రెండు నేత్రాలు మరో ఇద్దరికి దానం చేశారు. ఆమె భర్త వెంకటరావు గ్రామీణ వికాస బ్యాంకు ఉద్యోగి, ఆయన ఇది వరకే మరణించారు. ఆమె కుమారుడు యశ్వంత్ అజయ్, కుమార్తె త్రిస్వర్ణ తమ తల్లి చేసిన మహత్కార్యం పట్ల దుఃఖంలోనూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. పద్మజ మరణంతోపాటు ఆమె చేసిన అవయవ దానం పట్ల పలువురు చలించిపోయారు.

30 వరకూ ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు

అనకాపల్లి : ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఈ ఏడాది ఫెయిల్ అయిన విద్యార్థిని, విద్యార్థులు సప్లమెంటరీ పరీక్షలు రాసేందుకు గాను పరీక్ష ఫీజు గడువును ఈనెల 30వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ప్రభుత్వం అనుమతి కల్పించిందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారిణి బి.సుజాత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు తప్పిన విద్యార్థిని విద్యార్థులు అయా కళాశాలల లాగిన్‌లో పరీక్ష ఫీజులను చెల్లించాలని ఆమె కోరారు.

సుందరానికి షాక్

- యలమంచిలి జనసేనలో రెబెల్స్'
- వివాదాస్పద నేత సుందరపు విజయ్‌కుమార్‌పై కేసులు
- వ్యాపారం పేరుతో మహిళను మోసం చేసిన సుందరపు సోదరులు
- గతంలోనే సీపీకి ఫిర్యాదు చేసిన బాధిత మహిళ
- తాజాగా మత్స్యకారుడిపై హత్యాయత్నం చేసినట్లు ఆరోపణలు
- పూడిమడక మత్స్యకార కుటుంబాలు తిరుగుబాటు
- ఎన్నికల్లో గట్టి బుద్ధి చెబుతామంటూ హెచ్చరికలు
- రెబల్‌గా నామినేషన్ వేసిన జనసేన మత్స్యకార నేత ఎర్రిపల్లి కిరణ్



విశాఖ సిటీ: నోటి దురదతో అందరినీ దుర్భాషలాడడం.. వ్యాపారం పేరుతో మహిళకు మోసం.. నిరసనల పేరుతో పరిశ్రమలకు బ్లాక్‌మెయిలింగ్.. తాజాగా మత్స్యకార నాయకుడిపై హత్యాయత్నం .. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. యలమంచిలి నియోజకవర్గం జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికంగా ప్రజాబలం లేనప్పటికీ.. మత్స్యకారులపై దాడులకు పాల్పడినప్పటికీ.. ఐవీఆర్‌ఎస్ సర్వేలో అతడికి వ్యతిరేకంగా వచ్చినప్పటికీ.. ఆయనకు జనసేనకు టికెట్ ఇవ్వడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రజల్లోనే కాకుండా.. సొంత పార్టీ నేతలు సైతం విజయ్ అభ్యర్థిత్వాన్ని గట్టిగా వ్యతిరేకిస్తుండడం గమనార్హం. అతడికి వ్యతిరేకంగా జనసేన పార్టీ రెబల్ అభ్యర్థిగా మత్స్యకార నాయకుడు ఎర్రిపల్లి కిరణ్ నామినేషన్ వేశారు. విజయ్‌కు వ్యతిరేకంగా పూడిమడకతో పాటు మరి కొన్ని గ్రామాల్లో జనసేన నాయకులు, అభిమానులు తిరుగుబాటుకు సన్నద్ధమవుతున్నారు.

సుందరపు సోదరులపై సీపీకి ఫిర్యాదు

సుందరపు సోదరులు వ్యాపారం పేరుతో ఒక మహిళను దారుణంగా మోసం చేశారు. ముందు సుందరపు సతీష్ రూ.23 లక్షలు, తరువాత సుందరపు విజయ్‌కుమార్ రూ.17 లక్షలు పెట్టుబడులు రూపంలో తీసుకొని తిరిగి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయాన్ని సదరు మహిళ 2020లో అప్పటి నగర పోలీస్ కమిషనర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఇప్పుడు సుందరపు వ్యతిరేక వర్గీయులు తెరపైకి తీసుకువస్తున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్‌లో కార్డియాలజిస్టుగా పనిచేస్తున్న డాక్టర్ రమేష్ ముద్దాడ **2012లో మరణించారు. అతని మరణం అనంతరం వచ్చిన డబ్బుతో భార్య శ్రీదేవి ముద్దాడ, ఇద్దరి పిల్లలను చూసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ కుటుంబానికి పరిచయం ఉన్న సుందరపు సతీష్ కుమార్(సుందరపు విజయ్‌కుమార్ సోదరుడు) 2013లో కలిసి ఒక వ్యాపారం కోసం చెప్పాడు.** ఆమెను అక్కా అని పిలిచే సతీష్ కర్నాటకలో బళ్లారి హెవీ మోటల్ వెహికల్ వ్యాపారంలో రూ.23 లక్షలు పెట్టుబడి పెడితే నెలకు రూ.1.8 లక్షలు రిటర్న్స్ వస్తాయని నమ్మించారు. దీనికి 2013, ఫిబ్రవరిలో ఆమె తన వద్ద ఉన్న బంగారాన్ని తనఖా పెట్టి రూ.23 లక్షలు ఎటువంటి ఒప్పంద పత్రాలు లేకుండానే సతీష్‌కు డబ్బులు ఇచ్చారు. తొలి నాలుగు నెలలు రిటర్న్స్ ఇవ్వని సతీష్ ఆ తరువాత ఒక ఏడాది పాటు కేవలం 80 వేలు మాత్రమే ఇచ్చాడు. మిగిలిన డబ్బులు జీతాలు, వాహనాలకు ఖర్చు అవుతుందని చెప్పేవాడు. ఆ తరువాత నుంచి అది కూడా ఇవ్వడం మానేశాడు. డబ్బులు కోసం అతడికి అడగగా వ్యాపారంలో నష్టం వచ్చిందని, అసలు కూడా రాదని తేల్చి చెప్పేశాడు. దీంతో ఆమె తీసుకున్న రుణం తీర్చడానికి చాలా ఇబ్బందులు పడ్డారు.

కొద్ది రోజులకు విజయ్‌కుమార్..

కొద్ది రోజులకు విజయ్‌కుమార్.. శ్రీదేవిని కలిసి రిలయన్స్ టెలీకాంలో 4జీ కేబుల్ ప్రాజెక్టుకు రూ.40 లక్షలు పెట్టుబడి పెట్టాలని కోరాడు. ముందు అతని సోదరుడు చేసిన మోసం కారణంగా ఆ ప్రతిపాదనను శ్రీదేవి తిరస్కరించారు. అయితే విజయ్‌కుమార్ ఆమెను రిలయన్స్ ఆఫీస్‌కు తీసుకు వెళ్లి అక్కడి ప్రతినిధులతో మాట్లాడించాడు. మంచి ఆదాయం వస్తుందని, గత వ్యాపారంలో వచ్చిన నష్టాల నుంచి బయటపడడానికి మంచి అవకాశమని, సంస్థ నుంచి బిల్లులు కూడా నేరుగా ఆమె అకౌంట్‌లోనే పడతాయని నమ్మించాడు. దీంతో ఆమె మరోసారి నమ్మి తన భర్త ఫ్లాట్‌పై లోన్ తీసుకొని రూ.17 లక్షలు సుందరపు విజయ్‌కుమార్‌కు ఇచ్చారు.

విజయ్‌కుమార్ జనసేన పార్టీ కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో శ్రీదేవి ఆ పనులు చూసుకోవడం ప్రారంభించారు. మొత్తం ప్రాజెక్ట్ వర్క్ పూర్తయినప్పటికీ.. ఆమె ఖాతాలో డబ్బులు పడలేదు. దీంతో ఆమె నేరుగా రిలయన్స్ ఆఫీస్‌కు వెళ్లి వాకబు చేయగా ఆ పనులకు సంబంధించి బిల్స్ విజయ్‌కుమార్ అకౌంట్‌కు రిలీజ్ చేసినట్లు చెప్పారు. దీంతో డబ్బు కోసం శ్రీదేవి.. సుందరపు విజయ్‌కుమార్‌ను అడిగారు. దీనికి ఆయన చెప్పిన సమాధానం విని షాక్‌కు గురయ్యారు. పనులు చేయించిన ఉద్యోగికి రూ.10 వేలు మాత్రమే ఇస్తామని, మహిళ కాబట్టి ఆమెకు నెలకు రూ.20 వేలు చొప్పున ఎన్ని నెలలు పనిచేస్తే అంత డబ్బు ఇవ్వాలని విజయ్ తన మనిషికి పురమాయించాడు. దీంతో పెట్టుబడి డబ్బులు ఇవ్వాలని అడిగినా విజయ్‌కుమార్ ఆమెను పట్టించుకోలేదు. ఎప్పటికప్పుడు ఆమె అతడిని డబ్బు కోసం అడగగా కొద్ది నెలల్లో ఇస్తానని రాతపూర్వకంగా హామీ ఇచ్చాడు. అయినప్పటికీ డబ్బు తిరిగి చెల్లించలేదు. దీంతో శ్రీదేవి అప్పటి నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

మత్స్యకార నేతపై హత్యాయత్నం

యలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ పూడిమడక గ్రామ నివాసి, అదే పార్టీకి చెందిన మత్స్యకారుడు ఎర్రిపల్లి కిరణ్‌పై దాడి, హత్యా ప్రయత్నాలు చేసినట్లు ఆరోపణలు ఇప్పుడు నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ ఘటనతో పూడిమాడకతో పాటు తీర ప్రాంతవాసులు, ఉమ్మడి విశాఖలో మత్స్యకారులు సుందరపు విజయ్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూడిమడకకు చెందిన కిరణ్ చురుగ్గా జనసేన పార్టీలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. దీంతో జనసేన అధినాయకులు సైతం అతడిని అభినందించారు. అయితే సుందరపు విజయ్‌కుమార్ మాత్రం కిరణ్‌పై కక్ష గట్టి దాడికి పాల్పడినట్లు ఆరోపిస్తున్నారు. దీనిపై కిరణ్, అతని కుటుంబ సభ్యులు, పూడిమడక గ్రామస్తులు పలుమార్లు మీడియా సమావేశాలు నిర్వహించి సుందరపు విజయ్‌కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తాజాగా మత్స్యకార నేత కిరణ్ జనసేన రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. సుందరపు విజయ్‌కుమార్‌కు జనసేన టికెట్ ఇవ్వడం పట్ల మత్స్యకారులు తీవ్రస్థాయి మండిపడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో విజయ్‌కు గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో సుందరపు వర్గీయులలో ఆందోళన వ్యక్తమవుతోంది.

సవాల్‌కు సిద్ధమా?

- అభివృద్ధి జరగలేదని నిరూపించు... నామినేషన్ ఉపసంహరించుకుంటా..
- మాడుగుల ప్రగతి దేశానికే ఓ రోల్ మోడల్
- బహిరంగ చర్చకు సిద్ధమా?
- సీఎం రమేష్‌పై బూడి ఫైర్



మాట్లాడుతున్న బూడి ముత్యాలనాయుడు

సాక్షి, అనకాపల్లి: ప్రజా జీవితం అంటే బ్యాంకులను దోచుకుని సంపాదించిన డబ్బుతో రాజ్యసభ సీటు కొనుగోలు చేయడం కాదని సి.ఎం.రమేష్‌పై వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు ఫైర్ అయ్యారు. మోసాలతో చేసేది రాజకీయం కాదని.. దాని పరమావధి ప్రజా శ్రేయస్సు కావాలన్నారు. అనకాపల్లిలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో మాడుగుల నియోజకవర్గాన్ని ఒక మోడల్‌గా తీర్చిదిద్దానని.. దేశంలో ఒక గ్రామీణ నియోజకవర్గం ఇలా అభివృద్ధి చెందింది లేదన్నారు. ఒక్క మాడుగుల నియోజకవర్గంలోనే జలజీవన్ మిషన్ ద్వారా రూ.178 కోట్ల నిధులతో ఇంటింటా తాగు నీటి కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నుంచి నేటి వరకూ రహదారి సదుపాయాలు లేని దేవరాపల్లి మండలం నేరాలపూడి గిరిజన గ్రామంలో కేవలం 28 రోజుల్లోనే తారురోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు.

మీడియా సమక్షంలో చర్చించుకుందాం రండి

మాడుగుల నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని మీడియా ముందు, పత్రికల ముందు సీఎం రమేష్ చెబుతున్నాడని.. మాడుగులలో ఎన్ని గ్రామాలున్నాయో.. అక్కడ ఎన్ని రోడ్లు ఉన్నాయో తెలుసా..? అని ప్రశ్నించారు. 'నీకు అనుకూల మీడియాని.. నీకు మద్దతుగా నిలిచిన పార్టీల నాయకులను తీసుకుని రా..? నేనొక్కడినే వస్తా..? అభివృద్ధి జరిగిందో..లేదో చూద్దువు గానీ' అని సవాల్ విసిరారు. అభివృద్ధి జరగలేదని నిరూపిస్తే తాను నామినేషన్ ఉపసంహరించుకుంటానని, నిరూపించలేకపోతే వెనుతిరగడానికి నీవు సిద్ధమా అని సీఎం రమేష్‌కు సవాల్ విసిరారు. ప్రతీ గ్రామానికి ప్రగతి ఫలాలు అందించిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.

నామినేషన్ల కోలాహలం

- పార్లమెంట్‌కు 12, అసెంబ్లీకి 37 దాఖలు
- భారీ ర్యాలీలతో వెళ్లిన ధర్మశ్రీ, మలసాల

తుమ్మపాల: నామినేషన్ దాఖలుకు ఇంకా ఒక్క రోజే మిగిలి ఉండగా బుధవారం జిల్లా అంతటా నామినేషన్ల సందడి నెలకొంది. పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి 12మంది, అసెంబ్లీ స్థానాలకు 37 మంది అభ్యర్థులు బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడు, డమ్మీగా బీవీ సత్యవతి ఒక్కొక్క సెట్టు, బీజేపీ అభ్యర్థిగా చింతకుంట రమేష్‌మున్నయ్య, కాంగ్రెస్ పార్టీ నుంచి వేగి వెంకటేష్ రెండేసి సెట్లు, డమ్మీగా గార సూర్యారావు, స్వతంత్ర అభ్యర్థులుగా తుమ్మపాల హరిశంకర్, మేరుగ రాజబాబు, దళిత బహుజన పార్టీ నుంచి వడ్లమూరి కృష్ణస్వరూప్, బహుజన సమాజ్ పార్టీ నుంచి పలకా శ్రీరామమూర్తి, భారత చైతన్య యువజన పార్టీ నుంచి నమ్మి అప్పలరాజు ఒక్కొక్క సెట్టు చొప్పున జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టికి నామినేషన్ పత్రాలను సమర్పించారు.

అసెంబ్లీ నియోజకవర్గ స్థానాల్లో... అనకాపల్లి నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మలసాల భరత్‌కుమార్ మూడు సెట్లు, డమ్మీగా గంగుపాం మోహర్ నివేదిత ఒకటి, స్వతంత్ర అభ్యర్థిగా కాపరపు సత్యనారాయణ, జనసేన పార్టీ నుంచి కొణతాల రామకృష్ణ రెండేసి సెట్లు, చోడవరం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కరణం ధర్మశ్రీ రెండు సెట్లు, డమ్మీగా కరణం వెంకటలక్ష్మి ఒక సెట్టు, సీపీఐ అభ్యర్థిగా సవరాల గణేష్, కాంగ్రెస్ పార్టీ నుంచి జగతా శ్రీనివాసరావు ఒక్కొక్క సెట్టు నామినేషన్లు వేశారు. పాయకరావుపేట నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బోణి తాతారావు రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా మారుతి నారాయణచక్రవర్తి, దళిత బహుజన పార్టీ నుంచి వడ్లమూరి కృష్ణస్వరూప్ ఒకటి చొప్పున, యలమంచిలి నుంచి వైఎస్సార్‌సీపీ డమ్మీగా యు.సుకుమార్‌వర్మ నాలుగు, జనసేన పార్టీ నుంచి సుందరపు విజయ్‌కుమార్ రెండు, స్వతంత్ర అభ్యర్థిగా మేరుగ రాజబాబు, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి దాడి పూర్ణచంద్రరావు, టీడీపీ నుంచి ప్రగడ అన్నపూర్ణ, బహుజన సమాజ్ పార్టీ నుంచి లంబా శ్రీను ఒకటి చొప్పున, మాడుగల నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా బూడి రవికుమార్ రెండు, పైల ప్రసాదరావు, మల్ల ఆరినాయుడు, మల్లవరపు లోవ, టీడీపీ డమ్మీగా బండారు మాధవీలత ఒకటి చొప్పున, నర్సీపట్నం నుంచి వైఎస్సార్‌సీపీ నుంచి డమ్మీగా పెట్ల కళావతి ఒకటి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రుత్తల శ్రీరామమూర్తి రెండు, బీఎస్పీ నుంచి బొట్ట నాగరాజు ఒకటి నామినేషన్లు దాఖలు చేశారు.



నామినేషన్ దాఖలుకు ర్యాలీగా వెళుతున్న మలసాల, (ఇన్‌సెట్) ఆర్వో జాహ్నవికి నామినేషన్ సమర్పిస్తున్న మలసాల భరత్‌కుమార్, పక్కన ఎంపీ సత్యవతి, బూడి ముత్యాలనాయుడు, దిలీప్‌కుమార్



చోడవరం పట్టణంలో ర్యాలీ, (ఇన్‌సెట్) చోడవరంలో ఆర్వో చిన్నికృష్ణకు తన నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ

అట్టహాసంగా మలసాల నామినేషన్

అనకాపల్లి: పట్టణంలో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ ప్రజలు, పార్టీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ నామినేషన్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనకాపల్లి పట్టణ, మండలం, కశింకోట నుంచి 30 వేల మందితో వచ్చిన స్థానిక రింగ్‌రోడ్డులో పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. తల్లిదండ్రులకు పాదాభివందన చేసి మలసాల సతీమణి నివేదితో కలిసి ర్యాలీగా బయలుదేరారు. దారిపొడవునా జై జగన్... జైజై భరత్ నినాదాలు మార్మోగాయి. ర్యాలీలో పులివేషాలు, కేరళ డప్పులు, కొయ్య డ్యాన్స్, తప్పెటగుళ్లు, కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.జాహ్నవికి నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎంపీ బీవీ సత్యవతి, ఏపీఐడబ్ల్యూ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ ఆయన వెంట ఉన్నారు. అనంతరం భరత్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని చూపి ఎన్నికల నామినేషన్ ర్యాలీలో ప్రజలందతా స్వచ్ఛందంగా వచ్చి మద్దతు పలకడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. అత్యధిక మెజార్టీతో గెలిపించి మరిన్ని సంక్షేమ పథకాలను బడుగు, బలహీన వర్గాల ప్రజలు అందుకోవాలని కోరారు.

చోడవరం జనసంద్రం

చోడవరం: పట్టణం జనసంద్రమైంది. ఎక్కడ చూసినా వైఎస్సార్‌సీపీ అభిమానుల కోలాహలమే నెలకొంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానుల మధ్య వైఎస్సార్‌సీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ బుధవారం నామినేషన్ వేశారు. ఆయన వెంట భార్య విజయలక్ష్మి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు శరగడం చినఅప్పలనాయుడు, బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ దొండా రాంబాబు ఉన్నారు.

25 వేలకు పైబడి కార్యకర్తలు అభిమానులు ఈ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ర్యాలీలో అడుగడునా జనం పూల వర్షం కురిపించారు. ఓపెన్ టాప్ ప్రచార వాహనంపై ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు ప్రజలకు అభివాదం చేశారు. ర్యాలీ ప్రారంభంలో అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి మాట్లాడారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు మరికొంత కాలం ప్రజలకు పూర్తిగా అందాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

కోడ్ ఉల్లంఘించిన అప్పన్న దేవస్థానం ఉద్యోగులు!

సింహాచలం: ఎన్నికల నియమావళిని సింహాచలం దేవస్థానం ఉద్యోగులు అతిక్రమించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు నామినేషన్ సందర్భంగా ఏకంగా విజయనగరం వెళ్లి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందించినట్టు ప్రచారం జరుగుతోంది. ఏఈతో పాటు సూపరింటెండెంట్, కాంట్రాక్ట్ ఉద్యోగి ఉన్నట్టు తెలుస్తోంది. వైదిక సిబ్బంది కూడా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

అత్యుత్సాహం

ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి దేవస్థానంలో నిబంధనలు అమలు చేస్తున్నారు. వీఐపీలకు సైతం స్వామివారి దర్శనాల్లో నియమావళిని కచ్చితంగా పాటిస్తున్నారు. అలాంటిది ఉద్యోగులే కోడ్ నిబంధనలు ఉల్లంఘించి అత్యుత్సాహం ప్రదర్శించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా వుండగా స్వామివారి వార్షిక కల్యాణోత్సవానికి సంబంధించిన అక్షింతలు, ప్రసాదంతో పాటు మే 10న జరిగే చందనోత్సవానికి సంబంధించిన మినిట్స్‌ను అశోక్‌గజపతిరాజుకు ఇచ్చేందుకే సదరు ఉద్యోగులు వెళ్లినట్టు అధికారులు చెబుతున్నారు.

పోలీసుల అదుపులో ఉక్కు కార్మిక నాయకులు



గాజువాక పోలీస్ స్టేషన్‌లో కార్మిక నాయకులు

ఉక్కునగరం: కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పర్యటన నేపథ్యంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సి.ఎం.రమేష్ నామినేషన్ కార్యక్రమానికి రాజ్‌నాథ్ సింగ్ వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కూర్మన్నపాలెం దీక్ష శిబిరంలో నిరాహార దీక్ష చేస్తున్న వారిని పోలీసులు బలవంతంగా గాజువాక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సుమారు 200 మంది పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పలువురిని అదుపులోకి తీసుకున్నారు. రాజ్‌నాథ్ సింగ్ పర్యటన అనంతరం వారిని విడుదల చేస్తామని పోలీసులు తెలిపారు.

దేవరాపల్లిలో ఈదురు గాలులు

దేవరాపల్లి: ఈదురుగాలుల ధాటికి దేవరాపల్లిలోని సంతతోట, శ్రీరాంపురంలో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీతంపేటలో పరవాడ లక్ష్మయ్య, గాడి సూర్యనారాయణ తదితరులకు చెందిన రెండు ఎకరాల్లో అరటి తోటలు నేలమట్టమయ్యాయి. ఉదయం నుంచి ఎండలు మండిపోగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. కాశీపురం, రైవాడ తదితర గ్రామాల్లో చిరుజల్లులు కురవగా, వాలాబులో భారీ వర్షం పడింది. మండు వేసవిలో వర్షం పడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

దర్శనానికి వచ్చి ఉంగరం దొంగిలిస్తారా..?

- సింహగిరిపై భక్తులను ప్రశ్నించిన అర్చకులు
- దొంగిలించలేదంటూ కన్నీటిపర్యంతమైన భక్తులు
- చివరికి వినోదోత్సవమని తెలుసుకుని సంభ్రమాశ్చర్యం
- నవ్వులతో సందడిగా కార్యక్రమం



దేవస్థానం అర్చకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విజయనగరానికి చెందిన భక్తురాలు



స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ ప్రశ్నించడంతో భయభ్రాంతులు చెందుతున్న ఆరిలోవకి చెందిన నూతన దంపతులు



అలంకరణలో అప్పన్న

సింహాచలం: 'శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దర్శనానికి వచ్చి ఆయన ఉంగరాన్నే దొంగిలిస్తారా? మర్యాదగా దొంగిలించిన ఉంగరాన్ని ఇచ్చేయండి.. లేదంటే పోలీసులకు అప్పగిస్తాం..'అని సింహాచలం కొండకి వచ్చిన పలువురు భక్తులను దేవస్థానం స్థానాచార్యులు ప్రశ్నించే సరికి వారంతా కంగుతిన్నారు. 'మేం దొంగల్లా కనిపిస్తున్నామా.! స్వామి దర్శనానికి వస్తే ఉంగరాన్ని దొంగతనం చేశారంటారేంటి? పైగా తాళ్లతో బంధించి తీసుకొస్తారా..'అంటూ భక్తులు ఆవేశంతో స్థానాచార్యులపై గర్జించారు. 'చూడండీ.. మీరు దొంగతనం చేసినట్లు మా దగ్గర ఆధారాలున్నాయి. పోలీసులు తీసుకెళ్లకముందే దొంగిలించిన ఉంగరాన్ని మర్యాదగా ఇచ్చేయండి.' అంటూ స్థానాచార్యులు మరింత గర్జించి అడగటంతో భక్తుల కళ్లంట నీళ్ల గిర్రున తిరిగాయి. తాము ఉంగరం తీయలేదని ఎంత చెబుతున్నా వినకుండా మీరే దొంగ అంటూ పదే పదే ప్రశ్నించడంతో వారంతా ఆగ్రహంతో చిందులు వేశారు. పైగా చేతికున్న ఉంగరాలను చూపెట్టమని.. దొంగిలించిన ఉంగరంలా ఇవి ఉన్నాయంటూ స్థానాచార్యులు అడగటంతో భక్తుల నోటి మాట రాలేదు. చివరికి ఇదంతా వినోదోత్సవంలోని ఘట్టమని తెలుసుకుని భక్తులంతా సంభ్రమాశ్చర్యానికి గురయ్యారు. తమకు మాత్రమే దక్కిన భాగ్యంగా భావించి ఆనంద భరితులయ్యారు. ఇదీ సింహగిరిపై బుధవారం నవ్వుల సందడిగా జరిగిన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి వినోదోత్సవం. స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి జరిగిన మృగయోత్సవంలో పోయిన ఉంగరం వెతికే ఘట్టాన్ని బుధవారం ఉదయం వినోదోత్సవంగా నిర్వహించారు.

ఏడు పరదాల్లో దాగి ఉన్న స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రాజగోపురం వద్ద పల్లకీలో అధిష్టింపజేశారు. స్వామి దూతగా పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కర్ర, తాడు పట్టుకుని దర్శనానికి వచ్చిన పలువురు భక్తులను ఉంగరం దొంగిలించారంటూ తాళ్లతో బంధించి రాజగోపురం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్ దొంగిలించిన ఉంగరాన్ని ఇవ్వాలంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఉత్సవం గురించి తెలియని వాళ్లు కన్నీటిపర్యంతం చెందారు. ఉత్సవం గురించి తెలిసిన వాళ్లు నవ్వుతూ సమాధానం చెప్పారు. ఈ తరుణంలోనే స్వామిపై ఉన్న ఒక్కొక్క పరదాను తొలగించారు. చివరికి స్వామి చివరి పరదాలోనే ఉంగరం దొరికింది.

ఎస్.కోట మండలం బొద్దాంకి చెందిన నూతన దంపతులు ఈశ్వరరావు, మాధవి, ఆరిలోవ ప్రాంతానికి చెందిన మాళీ, గౌతమి, ఆంధ్రా యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు హిమజ, ప్రత్యూష, లావణ్య, శ్వేత అశ్విని, టెక్కలికి చెందిన అక్కాతమ్ముళ్లు జీవిత, నవీన్‌కుమార్‌లను పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తాళ్లతో బంధించి తీసుకురాగా వారిని స్థానాచార్యులు ప్రశ్నించారు. విజయనగరం జిల్లా దాసన్నపేటకి చెందిన రోజా అనే మహిళ తన కుమార్తె మిక్కి, అల్లుడు కిశోర్, మనవలతో కలిసి సింహగిరికి రాగా వారిని తాళ్లతో బంధించారు. వాళ్ల చేతికి ఉన్న ఉంగరం.. దొంగిలించిన ఉంగరంగానే ఉందని స్థానాచార్యులు, అర్చకులు అనుమానం వ్యక్తం చేయడంతో వారంతా వాదనకు దిగారు. నా కూతురుకు, అల్లుడికి నిశ్చితార్థం రోజు పెట్టిన ఉంగరాలు ఇవని, దొంగిలించినవి కాదని స్థానాచార్యులతో రోజా వాదించారు. ఇదిలా ఉండగా దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాస మూర్తి, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, ఆలయ కొత్వాల్ నాయక్ లంక సూరిబాబు, ఆలయ ఎస్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు, సూపరింటెండెంట్ వెంకటరమణ, ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు సైతం దొంగలుగా పట్టుపట్టారు. తొలుత స్థానాచార్యులను కూడా తాళ్లతోనే బంధించి తీసుకురావడం విశేషం. అదే సమయంలో సింహగిరి వచ్చిన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వినోదోత్సవంలో పాల్గొని.. స్వామిని దర్శించుకున్నారు.



టెక్కలికి చెందిన భక్తులను ప్రశ్నిస్తున్న స్థానాచార్యులు



ఈవోని తాళ్లతో బంధించిన పురోహిత్ అలంకారి



చివరి పరదాలో ఉంగరాన్ని వెతుకుతున్న అర్చకులు



దొరికిన ఉంగరాన్ని చూపిస్తున్న పురోహిత్ అలంకారి

కరణం ధర్మశ్రీ ఆస్తులు రూ.11.84 కోట్లు

- అఫిడవిట్‌లో వెల్లడి

చోడవరం : వైఎస్సార్‌సీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ తన నామినేషన్ పత్రాలతోపాటు తన ఆస్తుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్‌ను ఎన్నికల అధికారులకు బుధవారం అందజేశారు. తనతో పాటు తన కుటుంబ సభ్యులకు చెందిన మొత్తం ఆస్తి విలువ రూ. 11కోట్ల 84లక్షలుగా తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో చరాస్తులు రూ. కోటి 23లక్షల 32వేలుగాను, స్థిరాస్తులు రూ. 10కోట్ల 61లక్షలు విలువగా పేర్కొన్నారు. ఇందులో తన పేరున రూ. 2కోట్ల 56 లక్షలు, తన భార్య పేరున రూ. 6కోట్ల 22లక్షలు, తన కుమారుడు పేరున కోటి 89లక్షల విలువైన ఆస్తులు ఉన్నట్టు తెలిపారు. తన పేరున రూ. 17లక్షల 64వేలు, తన భార్య పేరున రూ. 96లక్షల 46వేలు బ్యాంక్ రుణాలు ఉన్నట్టు పేర్కొన్నారు. తనపై ఉన్న పోలీసు కేసులకు సంబంధించి బుచ్చెయ్యపేట పోలీసు స్టేషన్‌లో 2019లో ఎఫ్ఐఆర్ నెం.170, చోడవరం పోలీసు స్టేషన్‌లో 2023లో ఎఫ్ఐఆర్ నెం.1003, 171-సి, 188, 323 ఐపీసీ సెక్షన్లు ఉన్నట్లు పేర్కొన్నారు. టీడీపీ హయాంలో ప్రజల పక్షాన ఉద్యమాలు చేసినప్పుడు తనపై అక్రమంగా పెట్టిన కేసులుగా పేర్కొన్నారు. ఇవి ప్రస్తుతం కోర్టు విచారణలో ఉన్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రమాద స్థలంలో మృతదేహం

కోటవురట్ల: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఇందుకు సంబంధించి ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలు ...కొంకోట మండలం నూతనగుంటలపా లెం గ్రామానికి చెందిన అంజూరి నాగేశ్వరరావు (22) పందూరులో మంగళవారం జరిగిన ఇందేశమ్మతల్లి పండగకు బంధువుల ఇంటికి వచ్చాడు. అనంతరం అదే రోజు రాత్రి 11 గంటలకు తన స్వగ్రామం నూతనగుంటలపాలెంకు బైక్‌పై బయలు దేరాడు. రామచంద్రపురం శివారుకు వచ్చేసరికి నిద్రమత్తులో వేగంగా వెళ్లి చెట్టును ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందగా బుధవారం సాయంత్రం వరకు ఎవరూ గమనించలేదు. సాయంత్రం కొందరు వ్యక్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాని పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్ఐ రమణయ్య చెప్పారు.

శంకరంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు



తారువ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరిన శంకరం జనసేన కార్యకర్తలు



వైఎస్సార్‌సీపీ నేతలతో ముసిలినాయుడు

మాడుగుల రూరల్ : మాడుగుల మండలం శంకరం గ్రామానికి చెందిన మూడు కుటుంబాలు జనసేన కార్యకర్తలు, ఆ పార్టీని వీడి బుధవారం డిప్యూటీ సీఎం, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలునాయుడు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. శంకరం గ్రామ సర్పంచ్, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ విభాగం అధ్యక్షుడు శోలం రమేష్, వార్డు సభ్యుడు ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్ని అప్పారావు, చిన్ని కొండలరావు ఆధ్వర్యంలో చిన్ని రమణ, చిన్ని లక్ష్మణరావు, కడుతుల కొండలరావు తదితరులు వైఎసోస్‌ర్ సీపీలో చేరారు. తారువా క్యాంపు కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలునాయుడు వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడు నిజమైన ప్రజానాయకుడని, వార్డు స్థాయి నుంచి ఉప ముఖ్యమంత్రి వరకు సాగిన రాజకీయ ప్రయాణం తమకు ఆదర్శనీయమైనదని పార్టీలో చేరిన వారు పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధికి, అభ్యర్థుల విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

సొంత గూటికి చేరిన ముసిలినాయుడు

అచ్యుతాపురం: అచ్యుతాపురం మండలంలోని దోసూరు పంచాయితీ గండివానిపాలేనికి చెందిన సబ్బవరపు ముసిలినాయుడు రాజకీయంగా తిరిగి తన సొంత గూటికి బుధవారం చేరుకున్నారు. ఇటీవల అనివార్య కారణాల వల్ల వైఎస్సార్‌సీపీని వీడిన ముసిలినాయుడు ఎమ్మెల్యే కన్నబాబు రాజు సమక్షంలో తిరిగి పార్టీ కండువా కప్పుకున్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ,నర్మాల కుమార్,లాలం రాంబాబు, బుజ్జి,దేశంశెట్టి శంకర్‌రావు,చుక్క ప్రసాద్ పాల్గొన్నారు.

మే 13న దుకాణాలు, సంస్థలకు సెలవు

- పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు
- కార్మిక శాఖ ఆదేశాలు ఉల్లంఘిస్తే జరిమానా

సీతంపేట: కార్మిక శాఖ ఏపీ దుకాణాలు, సంస్థల చట్టం 1988 ప్రకారం ఆంధ్రప్రదేశ్ శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు జరిగే మే నెల 13వ తేదీన దుకాణాలు, సంస్థలకు సెలవు ప్రకటించినట్టు కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఆదూరి గణేశన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక లేదా ఏ ఇతర సంస్థల్లో ఉద్యోగం చేస్తున్న ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఆదేశించారు.

వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు కార్మిక శాఖ ఆదేశాలను ఉల్లంఘించినట్టయితే జరిమానాతోపాటు శిక్షార్హులని పేర్కొన్నారు. ఈ విషయమై కార్మిక శాఖ కమిషనర్ ఎం.వి.శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారని గణేశన్ చెప్పారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



రమణమ్మ (ఫైల్)

మునగపాక: రామగిరికి చెందిన ఉపాధిహామీ పథకం కూలీ పక్కుర్తి రమణమ్మ(73) బుధవారం గుండెపోటుతో మృతి చెందింది.ఎప్పటిలాగే రమణమ్మ గ్రామంలోని రాముల వారి చెరువులో పనులు చేసేందుకు వెళ్లింది. ఉదయం 6.15 గంటల సమయంలో రమణమ్మ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. గమనించిన సహచర కూలీలు రమణమ్మను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఎంపీడీవో ఎం.మన్మధరావు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు.

ప్రచార పర్వం



కె.కోటపాడు మండలం చౌడువాడలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ



నర్సీపట్నం మున్సిపాలిటీలో నీ భవిష్యత్తుకు భరోసా నేను ఇస్తానంటూ చిన్నారిని పలకరిస్తున్న ఎమ్మెల్యే గణేష్



వృద్ధులకు ఫ్యాన్ గుర్తు బ్రోచర్లు అందజేసి ఓటు అభ్యర్థిస్తున్న పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు

రైల్వేస్టేషన్‌లో 'ఎకానమీ మీల్స్'



విశాఖ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఎకానమీ మీల్స్ కౌంటర్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): రైల్వే ప్రయాణికులకు ఆరోగ్యవంతమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని తక్కువ ఖర్చుకే అందించేందుకు దేశవ్యాప్తంగా భారతీయ రైల్వే, ఐఆర్‌సీటీసీతో కలిసి 'ఎకానమీ మీల్స్', 'స్నాక్ మీల్స్'లను పరిచయం చేసింది. దీనిలో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలోని విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం ఈ స్టాళ్లను ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేకంగా జనరల్ కోచ్‌ల్లో ప్రయాణించే వారి కోసం ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన ట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులకు రెండు రకాల మీల్స్ అందుబాటులో ఉంచుతున్నారు. ఎకానమీ మీల్స్ రూ.20కు, స్నాక్ మీల్స్ రూ.50కు అందజేస్తున్నారు. ఈ సదుపాయాన్ని భారతీయ రైల్వేలోని 100 స్టేషన్లలో పరిచయం చేయగా.. ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్ స్టేషన్లలో అందుబాటులోకి తీసుకువచ్చారు. జనరల్ ప్రయాణికులకు వారి ప్రయాణ సమయంలో చేరువగా మీల్స్ కౌంటర్లను ఏర్పాటు చేశామని, వీటిని వినియోగించుకోవాలని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ కోరారు. వీటితోపాటు వాల్తేర్ డివిజన్ రైల్వే ప్రయాణికులకు తాగునీరు, మజ్జిగ వంటివి అందించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలకు కూడా అవకాశం కల్పిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నక్కపల్లి : జాతీయ రహదారిపై గొడిచర్ల సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పాయకరావుపేట దక్కన్ కంపెనీలో పనిచేస్తున్న నక్కపల్లి మండలం రేబాకకు చెందిన ఎస్.రమేష్, ఎస్.పాట్టియ్యలు కంపెనీలో విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుపై పడిపోయారు. వీరికి తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో వీరిని నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో పాట్టియ్య పరిస్థితి విషమంగా ఉండడంతో అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.





ప్రమాదంలో గాయపడ్డ రమేష్, పాట్టియ్యలు

పలు రైళ్ల దారి మళ్లింపు, రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం(విశాఖ) : ఆయా డివిజన్ల పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం వాల్తేర్ డివిజన్ పరిధిలో రాకపోకలు సాగించే పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు.

విజయనగరం-రాయగడ-రాయ్‌పూర్-నాగ్‌పూర్ మీదుగా మళ్లించిన రైళ్లు

ఈ నెల 28వ నుంచి మే 9వ వరకు, మే 15వ నుంచి 21వ వరకు విశాఖ-న్యూఢిల్లీ (20805) ఏపీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 28 నుంచి మే 9 వరకు, మే 15నుంచి 21వ న్యూఢిల్లీ -విశాఖ(20806)ఏపీ ఎక్స్‌ప్రెస్ , మే 2, 9, 16వ తేదీల్లో బయల్దేరే విశాఖ-గాంధీదాం(20803) వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 28, మే 5,9వ తేదీల్లో బయల్దేరే గాంధీదాం-విశాఖ(20804) వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 28, మే 5,19వ తేదీల్లో బయల్దేరే పూరి - ఓఖా (20819) ఎక్స్‌ప్రెస్, మే 1,8,15వ తేదీల్లో బయల్దేరే ఓఖా-పూరి(20820) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 29, మే 3,6,10,17,20వ తేదీల్లో బయల్దేరే విశాఖ- హజరత్ నిజాముద్దీన్ (12803) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్, ఈ నెల 28, మే 1,5,8,15,19వ తేదీల్లో బయల్దేరే హజరత్ నిజాముద్దీన్ - విశాఖ (12804) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్.

వయా విజయవాడ-గుంటూరు-పగిడిపల్లి మీదుగా..

ఈ నెల 28 నుంచి మే 9వ వరకు, 15 నుంచి 21 వరకు విశాఖలో బయల్దేరే విశాఖ- లోకమాన్య తిలక్ టెర్మినస్ (18519) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 28 నుండి మే 9 వరకు, 15 నుంచి 21 వరకు లోకమాన్య తిలక్ టెర్మినస్‌లో బయల్దేరే లోకమాన్య తిలక్ టెర్మినస్ - విశాఖ (18520) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ , మే 2,3,8,9,21,22వ తేదీల్లో షాలిమర్‌లో బయల్దేరే షాలిమర్- హైదరాబాద్ (18045) ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, మే 3,4,9,10,21,22వ తేదీల్లో హైదరాబాద్‌లో బయల్దేరే హైదరాబాద్- షాలిమర్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, మే21న సికింద్రాబాద్‌లో బయల్దేరే సికింద్రాబాద్ - షాలిమర్ (12774) ఎక్స్‌ప్రెస్, మే 2,3,8,9,20,21వ తేదీల్లో సీఎస్‌టీ ముంబయిలో బయల్దేరే సీఎస్‌టీ ముంబయి-భువనేశ్వర్(11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, మే 2,3,8,9,20,21వ తేదీల్లో భువనేశ్వర్‌లో బయల్దేరే భువనేశ్వర్- సీఎస్‌టీ ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 29, మే 6,20వ తేదీల్లో సికింద్రాబాద్‌లో బయల్దేరే సికింద్రాబాద్ - షాలిమర్ (07225) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 30, మే 7,21వ తేదీల్లో షాలిమర్‌లో బయల్దేరే షాలిమర్ -సికింద్రాబాద్ (07226) ఎక్స్‌ప్రెస్, మే 8న షాలిమర్‌లో బయల్దేరే షాలిమర్ - సికింద్రాబాద్ (22849) ఎక్స్‌ప్రెస్, మే 10న సికింద్రాబాద్‌లో బయల్దేరే సికింద్రాబాద్ - షాలిమర్ (22850) ఎక్స్‌ప్రెస్

వయా విజయవాడ-గంటూరు-సంద్యాల-గుంతకల్-బళ్లారి మీదుగా మే 5,19వ తేదీలలో యశ్వంత్‌పూర్‌లో బయల్దేరే యశ్వంత్‌పూర్ -టాటానగర్ (18112) ఎక్స్‌ప్రెస్ నడపనున్నారు.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు...

మే 7,16,18,21వ తేదీల్లో బయల్దేరే విశాఖ-సికింద్రాబాద్-విశాఖ (20833/20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఇరువైపులా 30 నిమిషాలు,మే 4,10,22వ తేదీల్లో బయల్దేరే విశాఖ- సికింద్రాబాద్- విశాఖ (20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఇరువైపులా గంటన్నర ఆలస్యంగా బయల్దేరుతాయి.

మధిరలో స్టాప్ తొలగింపు...

మే 9 నుంచి 20 వరకు భువనేశ్వర్-సీఎస్‌టీ ముంబయి (11020)కోణార్క్ ఎక్స్‌ప్రెస్, మే 9నుంచి 21 వరకు విశాఖ-మహబూబ్‌నగర్(12861) ఎక్స్‌ప్రెస్‌లకు మధిరలో హాల్ట్‌లను తొలగించారు.

క్లుప్తంగా

30 మందికి వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి శిరీష

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెంలో బుధవారం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. సుమారు 30 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఆస్పత్రి ఆయుర్వేద వైద్యాధికారి శిరీష రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆయుర్వేద వైద్య విధానం పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. వందేళ్ల చరిత్ర కలిగిన కన్నూరుపాలెం ఆయుర్వేద ఆస్పత్రిలో సాధారణ, దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ఉపకరించే మందులు ఉన్నాయని, ఆధునిక పరికరాలతో ఉచిత వైద్య సేవలందిస్తున్నామన్నారు. ఆరోగ్యానికి ఉపకరించే యోగా, ధ్యానంపై అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డి-1 సెక్షన్ పరిధిలో భీమునిగుమ్మం, మళ్ల వీధి, వేల్పులవీధి, నాగవంశంవీధి, వుడ్‌పేట, నర్సింగరావుపేట, దుర్గాలాడ్జీ వీధి, డి-2 సెక్షన్ పరిధిలో సాయి సుబ్బరాజువీధి, గౌరిసంఘం వీధి, సంతకంపట్టు ఏరియా, ఉమెన్స్ కాలేజీ ఏరియా, దిబ్బవీధి, రైతు సంఘం ఏరియా, అరుంధతి నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంత ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా పుష్పాంజలి



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

కశింకోట: స్థానిక లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం రాత్రి పుష్పాంజలి సేవను ఘనంగా నిర్వహించారు. స్వామి కల్యాణోత్సవం ముగింపులో భాగంగా స్వామి వారిని పూలతో అందంగా అలంకరించి పలు రకాల స్వీట్లు, పాలు, పండ్లు, ఇతర పిండి వంటకాలను నివేదించారు. ఈ సందర్భంగా అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

అనకాపల్లి సినిమాలు

మార్కెట్ మహాలక్ష్మి	: రాజా
పారిజాత పర్వం	: సత్యనారాయణస్క్రీన్-1
టెనెంట్	: సత్యనారాయణస్క్రీన్-2
గీతాంజలి	: షిర్డీసాయి
ఫ్యామిలీ స్టార్	: పర్తిసాయి
మంజుమ్మల్ బోయ్స్	: వెంకటేశ్వర
గుంటూరు కారం (2 షోలు)	: శ్రీసత్య
హ్యాపీడేస్(2 షోలు)	: శ్రీసత్య
డీజే టిల్లు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 66 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-12 యూనిట్లు, బి పాజిటివ్-21 యూనిట్లు, ఒ పాజిటివ్-31 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 315 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 220 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

జన సంద్రం



నామినేషన్ కార్యక్రమంలో ర్యాలీగా వెళుతున్న మహిళలు, (ఇన్‌సెట్) ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ సత్యవతి

- కోలాహలంగా భరత్‌కుమార్ నామినేషన్
- ఆర్వో కార్యాలయం వరకూ భారీ ర్యాలీ
- మండలం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు



ర్యాలీగా వస్తున్న పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు,పార్టీ నాయకులు

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ నామినేషన్ కార్యక్రమం బుధవారం కోలాహలంగా జరిగింది. ఎన్నడూ లేని విధంగా 40.3 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ మండుటెండను లెక్క చేయకుండా మండలంలోని పలు గ్రామాల ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దీంతో పట్టణంలోని రహదారులు కిక్కిరిసిపోయాయి. తో ఎక్కడ చూసినా జనమే...ఏ రోడ్డు చూసినా ప్రభంజనమే అన్నట్టుగా మారింది. పట్టణం, మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 30 వేలు మంది పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. మరో సారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని మరిన్ని సంక్షేమ పథకాలను అందుకోవాలని నినాదాలు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నూకాంబిక అమ్మవారి చిత్రపటానికి గజమాల వేసి, అమ్మవారి వేపచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి తల్లిదండ్రులు మలసాల రమణారావు, ధనమ్మకు పాదాభివందనం చేసి, నామినేషన్ వేసేందుకు ర్యాలీగా బయలుదేరారు. భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించడంతో ఎక్కడచూసిన వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడాయి. జై జగన్... జైజై జగన్ అంటూ ప్రజలు నినాదాలు చేశారు. ర్యాలీ ముందు ఏర్పాటు చేసిన గారిడీ డ్యాన్స్, మహిళా కళాకారుల డప్పు వాయిద్యాలు, పులివేషాలు, కేరళ డప్పులు, కోయడ్యాన్స్, తప్పెటగుళ్లు, కోలాటం పలువురిని ఆకర్షించాయి. వ్యాన్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, నివేదిత దంపతులు, ఎంపీ బీవీ సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గ పరిశీలకుడు బొడ్డేడ కాశీవిశ్వనాథం, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బి.వెంట సత్యవతి తదితరులు ఊరేగింపుగా రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ బెల్లంమార్కెట్, వన్‌వే ట్రాఫిక్ రహదారి, పెరుగుబజార్ జంక్షన్, మెయిన్‌రోడ్డు, వేల్పులవీధి జంక్షన్, నెహ్రూచౌక్, ఉడ్‌పేట, విజయరామరాజుపేట మీదుగా గాంధీనగరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో ర్యాలీని నిలిపివేశారు. అక్కడి నుంచి అభ్యర్థి వాహనం కార్యాలయానికి చేరుకుంది. కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ జాహ్నవికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎంపీ బీవీ సత్యవతి,పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోషఫ్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పట్టణమహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహ, వివిధ దేవాలయాల చైర్మన్లు కొణతాల రామకృష్ణ, కె.ఎం.నాయుడు, ఆళ్ల నాగేశ్వరరావు, వార్డు ఇన్‌ఛార్జ్‌లు కొణతాల భాస్కర్, పీలా రాంబాబు, కోరుకొండ రాఘవ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



వేప చెట్టుకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

కశింకోట:వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ నామినేషన్ కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్ రాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైఎస్ ఎంపీపీలు నమ్మి మీనా,పెంటకోట జ్యోతి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, పార్టీ యువజన విభాగం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, కశింకోట సర్పంచ్ మంత్రి జయరజని, సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు తదితరుల ఆధ్వర్యంలో వ్యాన్లు, ఆటోల్లో శ్రేణులు, అభిమానులు, ప్రజలు ఉత్సాహంగా తరలి వెళ్లారు.



విజయనగరం కళాకారుల పులివేషాలు



భద్రాచలం కళాకారుల కోయ డ్యాన్స్



తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన మహిళల డప్పుల డ్యాన్స్



నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ప్రజల మద్దతుతో విజయం సాధిస్తా : భరత్‌కుమార్

అనకాపల్లి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి, ఎన్నికల నామినేషన్ ర్యాలీలో ప్రజలందరూ స్వచ్ఛందంగా వచ్చి తనకు మద్దతు పలకడం ఎంతో ఆనందంగా ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక గాంధీనగరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ పత్రాలను బుధవారం దాఖలు చేసి అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు బడుగు, బలహీన వర్గాలకు మళ్లీ సంక్షేమ పథకాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం శుభ పరిణామన్నారు. అనకాపల్లి, కశింకోట మండలాల్లో సుమారు 40 సంవత్సరాలుగా రాజకీయ చరిత్ర కలిగిన కుటుంబం తమదన్నారు. పార్టీలో పెద్దలు, ప్రజల సహాయ సహకారాలతో ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని చెప్పారు. నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బొడ్డేడ కాశీవిశ్వనాథం, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



తాళ్లపాలెం సంత వద్ద గోతులు పూడ్చి తారు రోడ్డు వేస్తున్న సిబ్బంది

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం – నర్సీపట్నం రోడ్డుకు రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. తాళ్లపాలెం సంత ప్రాంతంలో పడిన గోతులను పూడ్చి వేసి, తారు రోడ్డు వేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు వాహనచోదకులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలిన చెట్టు

కశింకోట: మండలంలోని బయ్యవరం వద్ద బుధవారం సాయంత్రం వర్షం కురవడంతో పాటు ఈదురుగాలులు వీచాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై తాడి చెట్టు పడి విద్యుత్ సరఫరాకు సుమారు రెండు గంటలపాటు అంతరాయం కలిగింది. సకాలంలో స్పందించిన ఏపీఈపీడీసీఎల్ ఏఈలు పి.శ్రీనివాసరావు, ప్రకాష్, ఏపీఈ కోటేశ్వరరావుల ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది చెట్టును తొలగించి విద్యుత్ లైన్లను, సరఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించారు.



బయ్యవరంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిన చెట్టు

ఘనంగా పుష్పయాగం



పూజలందుకుంటున్న ఉత్సవ విగ్రహాలు



కోలాటం ఆడుతున్న కళాకారులు

మునగపాక: మండలంలోని పలు రామాలయాల్లో బుధవారం రాత్రి పుష్పయాగం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా మునగపాక పంచాయతీ వీధిలో ఉన్న రామాలయంలో పుష్పయాగం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. పలువురు భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంఆ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చూపిన కవలలు




ఉత్తమ ఫలితాలు సాధించిన రియాన, రిషిత

అనకాపల్లి : పదోతరగతి పరీక్షల ఫలితాల్లో స్థానిక ఉమ్మలాడకు చెందిన కవల విద్యార్థులు ప్రతిభ చూపారు. స్థానిక పూడిమడక రహదారిలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో చదివిన పళ్ల రియానా, పళ్ల రిషితలు ఇటీవల విడుదలైన పరీక్ష ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించారు. రియానా 578 మార్కులు సాధించి స్కూల్‌లో ద్వితీయస్థానంలో, రిషితా 574 మార్కులు సాధించి రిషిత 4వ స్థానంలో నిలిచారు. వీరిని హైస్కూల్ కరస్పాండెంట్ బుధవారం సత్కరించారు.

26న నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం



తిమ్మరాజుపేటలో నూతనంగా నిర్మించిన నూకాంబిక అమ్మవారి ఆలయం



నూకాంబిక అమ్మవారు

మునగపాక : తిమ్మరాజుపేటలో నూతనంగా నిర్మించిన నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఈ నెల 26న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ సౌజన్యంతో తిమ్మరాజుపేట దళితవాడను ఆనుకొని నూకాంబిక అమ్మవారి ఆలయ నిర్మాణం జరిగింది. అన్ని హంగులు పూర్తి చేసుకొని శుక్రవారం ప్రారంభానికి ఆలయం ఎదురు చూస్తుంది. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

తాగునీరు వృథా



హెడ్ లేని కుళాయి పైపు

రాంబిల్లి : దిమిలిలో తాగునీటి కుళాయిలకు హెడ్‌లు ఏర్పాటు చేయలేదు. పలు కుళాయిలకు హెడ్లు ఏర్పాటు చేయకపోవడంతో తాగునీరు వృథాగా పోతుంది. జల్ జీవన్ మిషన్ పథకంలో ఈ గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. మూడు నెలల కిందట ఏర్పాటు చేసిన కొన్ని కుళాయిలకు హెడ్లు బిగించకుండానే అస్తవ్యస్తంగా వదిలేశారు. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. అసలే వేసవి కావడంతో రెండు మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా అవుతోంది. ఈ తరుణంలో ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అవంతిలో పాలిటెక్నిక్ మాక్ గ్రాండ్ టెస్ట్

మాకవరపాలెం: అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ మాక్ గ్రాండ్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టుకు 123మందివిద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ మోహన్‌రావు బుధవారం తెలిపారు. పోటీ పరీక్షలపై విద్యార్థుల్లోభయాందోళన తొలగించేందుకు మాక్ గ్రాండ్ టెస్ట్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సుపై అవగాహన కల్పించామన్నారు.

విజయరామరాజుపేట, పీపీ అగ్రహారం వలంటీర్ల రాజీనామా



విధులకు రాజీనామా చేసిన విజయరామరాజుపేట వలంటీర్లు



పీపీ అగ్రహారంలో రాజీనామా పత్రాలను అధికారులకు అందిస్తున్న వలంటీర్లు

బుచ్చెయ్యపేట: మండలంలో విజయరామరాజుపేట, పీపీ అగ్రహారం గ్రామాల వలంటీర్లు తమ బాధ్యతలకు బుధవారం రాజీనామా చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను నిష్పక్షపాతంగా ప్రజలకు చేరవేస్తున్న తమను టీడీపీ, జనసేన పార్టీ అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ అగౌరపరచడాన్ని నిరసిస్తూ తమ విధుల నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నట్లు రెండు గ్రామాల వలంటీర్లు తెలిపారు. రాజీనామా పత్రాలను గ్రామ సెక్రటరీల ద్వారా ఎంపీడీవో వెంకటాచార్యకు అందించారు. ఇకపై ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం జగనన్నను రెండోసారి గెలుపు కోసం పాటు పడతామన్నారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

రాంబిల్లి : కొత్తపేట గ్రామంలో బుధవారం రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు చేసి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. దాతల విరాళాలతో రామాలయం నిర్మించనున్నారు. భూమి పూజ సందర్భంగా భక్తులు భజనలు చేశారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరుణలత, గ్రామ పెద్దలు జగన్నాథరావు, రాజుబాబు, బాబూరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన పూజల్లో గ్రామ పెద్దలు

ఘనంగా సీతారాముల ఆలయ ప్రారంభోత్సవం



ఎంపీ అభ్యర్థి బూడిని ఆశీర్వదిస్తున్న ఉమామహేశ్వరశర్మ

కె.కోటపాడు: యడ్లవానిపాలెంలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విగ్రహ, శిఖర ప్రతిష్ఠ అనంతరం సీతారాముల దర్శనభాగ్యాన్ని భక్తులకు కల్పించారు. సీతారాములను అనకాపల్లి ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉమామహేశ్వరశర్మ నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ నిర్మాణానికి సహకారం అందించిన బూడిని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుడు యడ్ల ముత్యాలనాయుడు(సీసీ), గనివాడ సత్యం, సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, లెక్కల గోపి, బొడ్డు దొరస్వామినాయుడు(లాయర్), దొగ్గ శివ, యడ్ల వెంకునాయుడు, యడ్ల సన్నిబాబు, సత్యం, యడ్ల రామునాయుడు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా చర్యలు

- ఎన్నికల అసిస్టెంట్ అధికారి నరేంద్ర

రోలుగుంట: ఎన్నికల కోడు అమలును అనుసరిస్తూ వడ్డాది-నర్సీపట్నం ఆర్అండ్‌బీ రోడ్డులో వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా మండల సరిహద్దు నిండుగొండ కూడలి వద్ద ఎన్నికల సహాయాధికారి కె.నరేంద్ర తన బృందంతో బుధవారం ఈ మార్గంలో వాహనాలను ఆపి నిశితంగా శోధిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఏమైనా నగదు కాని, దుస్తులు కాని మరేవిధమైన వస్తు రూపేణా తరలించే వాటిని అరికట్టేందుకు గాను ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు.

వాహనాల రవాణాకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సహాయాధికారి మాట్లాడుతూ రూ.50 వేలకు మించి తరలిస్తే, ఆధారాలు ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు చర్యలు ఉంటాయన్నారు. చోడవరం ఏఎస్సై డి.ఎస్.ఎం. కుమారి, కానిస్టేబుల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.